బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 03 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

మూసీ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు నిషేధం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మూసీ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. మూసీ నదికి 50 మీటర్ల వరకు బఫర్ జోన్‌లో నిర్మాణాలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మూసీ నుండి 50 నుండి 100 మీటర్ల వరకు కొత్త అనుమతులను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మాస్టర్ ప్లాన్ ఖరారయ్యే వరకు కొత్త అనుమతులు జారీ చేయరాదని ఉత్తర్వులో పేర్కొంది. మూసీ నది పరిసరాల్లో నిర్మాణాలను నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం నలుగురు సీనియర్ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. డీటీసీపీ, జీహెచ్ఎంసీ చీఫ్ ప్లానర్, హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌తో కమిటీని ఏర్పాటు చేసింది.కమిటీ అనుమతి ఇచ్చే వరకు కొత్త అనుమతులు ఇవ్వబోమని ప్రభుత్వం తెలిపింది. మూసీ నుండి 100 మీటర్ల వరకు ప్రభుత్వ పనులు చేపట్టాలన్నా ముందస్తు అనుమతి తప్పనిసరి అని పేర్కొంది.

బీసీ బిల్లుపై ధర్మయుద్ధం

- పరేడ్ గ్రౌండ్స్‌లో 10 లక్షల మందితో ధర్నా
- తెలంగాణలో బీసీల రిజర్వేషన్లకు అనుమతివ్వాలని కోరుతున్నాం :
- అలా చేస్తే 10 లక్షల మందితో సభ పెట్టి మోడీని సన్మానిస్తాం
- బీసీల పోరు గర్జన ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం అనుమతిం చకపోతే బలహీన వర్గాలు మోడీ సర్కార్‌పై ధర్మ యుద్ధం ప్రకటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకోవ డానికి అనుమతి ఇస్తే 10 లక్షల మందితో సభ పెట్టి ప్రధాని హోదాలో మోడీని సన్మానిస్తామన్నారు. ఇకపై విజ్ఞప్తులు తీసుకొని హస్తినకు రామని, బీజేపీ నేతలు ఎలా గల్లీలోకి వస్తారో చూస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లకు కేంద్రం అనుమతించాలని బుధవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో 12 బీసీ సంఘాలు 'బీసీల పోరు గర్జన' ఆందోళన చేపట్టాయి. బీసీ పోరు గర్జనలో సీఎం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిస్తే.. ఎందుకు ఆమోదించటం లేదని.. ఎందుకు అనుమతి ఇవ్వటం లేదని ప్రశ్నించారు. బీసీ ప్రధానిగా చెప్పుకునే మోడీకి.. బీసీల ఆత్మ గౌరవం కనిపించటం లేదా అని నిలదీశారు.

తెలంగాణ రాష్ట్రం నుంచి బీసీ గర్జన మొదలైందని.. ఇది ధర్మ యుద్ధం అని.. ఇక నుంచి మేం ఢిల్లీకి వచ్చేది లేదని.. మోడీనే తెలంగాణ గల్లీ గల్లీకి రప్పిస్తాం అంటూ ప్రశ్నించారు సీఎం రేవంత్ రెడ్డి. పార్లమెంట్ లో బలం లేకపోయినా.. రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తీసుకొచ్చారు.. ఆర్టికల్ 370 బిల్లు తీసుకొచ్చారు.. ఇప్పుడు వక్ఫ్ బిల్లు తీసుకొస్తున్నారు.. ఈ బిల్లులన్నింటికీ బీజేపీకి బలం లేకపోయినా తీసుకొచ్చారని.. అలాంటిది తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం.. బీసీ పోరు గర్జనకు దేశంలోని 16 పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నాయని.. కాంగ్రెస్ వంద మందికి పైగా ఎంపీల మద్దతు ఇస్తున్నా.. పార్లమెంట్ లో ఎందుకు ఆమోదించటం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు.. మోడీ ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే.. ఇది దేశ వ్యాప్తంగా ఉద్యమంగా రాజుకుంటుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వంలోని తండ్రీ, కొడుకుల ఉద్యోగాలు ఊడగొట్టి.. తెలంగాణ బిడ్డలకు

పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తి అంటారు

- కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు
- వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన మంత్రి
- 288-232 ఓట్లతో ఆమోదం

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లును బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం సభలో ప్రసంగించారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. "1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు,

మిగితా 2వ పేజీలో

లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో గంటల తరబడి తీవ్రమైన వాదనల తరువాత లోక్‌సభ వక్ఫ్ (సవరణ) బిల్లును గురువారం 288-232 ఓట్లతో ఆమోదించారు.

విద్యార్థులపై లాఠీఛార్జ్

హెచ్‌సీయూలో విద్యార్థుల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400ఎకరాల భూమి వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీలు చార్జి చేశారు. వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేసేందుకు చేపట్టిన పనులను వెంటనే నిలిపివేయడంతో పాటు, నిరసన తెలిపిన విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించు కోవాలంటూ హెచ్‌సీయూ టీచింగ్, నాన్ టీసింగ్, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ ఆడిటోరియం నుంచి ఈస్ట్ క్యాంపస్ మీదుగా వర్సిటీ ప్రధాన ద్వారం వరకు, అక్కడి నుంచి అడ్మినిస్ట్రేషన్ భవనం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహిం చారు. అయితే ర్యాలీ కొనసాగిస్తుండగా పోలీసులు విద్యార్థులపై లాఠీచార్జికి దిగారు. ఇదిలా ఉండగా ర్యాలీగా వెళ్లిన ప్రొఫెసర్లు.. రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.

భారీ బందోబస్తు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోకి సాధారణంగా వెళ్లే పరిస్థితులు లేకుండా భారీ బందోబస్తుతో కట్టుదిట్టంగా పోలీసు వలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపేందుకు బయటి నుంచి రాజకీయ, ప్రజా సంఘాల, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఎవ్వరూ రాకుండా భారీ బలగంతో మోహరించారు. ఆందోళనలో భాగంగా బుధవారం వర్సిటీలోని అంబేద్కర్ ఆడిటోరియం నుంచి ఈస్ట్ క్యాంపస్ మీదుగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేశారు. తమ క్యాంపస్‌లో తాము ప్రశాంతంగా ఉండకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, టెర్రరిస్టుల మాదిరిగా చూస్తూ తమపై లాఠీచార్జిలు చేయడం ఏంటంటూ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులు, బుల్డోజర్లతో క్యాంపస్ నుంచి బయటకు వెళ్లి పోవాలంటూ, క్యాంపస్ భూములను యూనివర్సిటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు.

పనులు ఆపండి

కంచె గచ్చిబౌలి భూముల్లో నేటి వరకు ఎలాంటి పనులు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కంచె గచ్చిబౌలి భూముల్లో గురువారం వరకు ఎలాంటి పనులు చేయొద్దని ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం గతేడాది జీవో 54 తీసుకువచ్చిందని.. దాని ద్వారా 400 ఎకరాలను టీజీఐఐసీకి అప్పగించారని తెలిపారు. చెట్లను కొట్టేసి, భూమిని చదును చేస్తున్నారని.. అటవీ ప్రాంతాన్ని కొట్టేయాలంటే నిపుణుల కమిటీ వేయాల్సిందేనన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు పని చేస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పునకు లోబడే ప్రభుత్వాలు పని చేయాలన్నారు. ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 2004లో ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించారని, ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఆ భూములను వినియోగించలేదని తెలిపారు. ఐఎంజీకి కేటాయించిన భూములను అప్పటి ప్రభుత్వం రద్దు చేసిందని, ఈ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా



లేదని, ఈ భూమికి ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారన్నారు. ఈ భూమికి సమీపాన నాలుగు హెలీప్యాడ్‌లు ఉన్నాయని, హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయంటూ ఏజీ వాదనలు వినిపించారు. పిటిషనర్ల వాదనలను బట్టి ఆయా ప్రాంతాలను అటవీ భూమిగా ప్రకటించాలని.. ఈ లెక్కనా హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు విచారణను రేపటికి వాయిదా వేసింది. అప్పటి వరకు ఆ భూముల్లో ఎలాంటి పనులు చేయొద్దని ఆదేశించింది.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్ సిగ్నల్..

- వాయుసేన అనుమతి మంజూరు..
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత పౌర విమానాశ్రయానికి భారత వైమానిక దళం ఆమోదం తెలిపిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకముందు మామునూరు విమానాశ్రయానికి అనుమతులు పొందిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ఆదిలాబాద్ విమానాశ్రయానికి భారత వైమానిక దళం నుంచి అనుమతులు పొందడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆరు నెలల స్వల్ప వ్యవధిలో రెండు విమానాశ్రయాలకు అనుమతులు పొందడం తెలంగాణ ప్రభుత్వ అవిశ్రాంత కృషి ఫలితమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

తెలంగాణ ప్రభుత్వ రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి రాసిన అధికారిక లేఖలో.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తో కలిసి ఈ ఎయిర్‌ఫీల్డ్‌ను జాయింట్-యూజర్ విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని ఐఏఎఫ్ సూచించింది. దీని వలన ఏఏఐ సివిల్ టెర్మినల్, ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, సహాయక మౌలిక సదుపాయాల కోసం పక్కనే ఉన్న భూమిని సేకరించాల్సి ఉంటుంది. ఐఏఎఫ్ నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (%చీఉజ%) జారీ చేయడానికి వివరణాత్మక ప్రతిపాదనను సమర్పించాలని ఏఏఐకి సూచించబడింది.

ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర విమానయానంతో పాటు.. జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం దీని కోసం ప్రత్యేక ప్రణాళిక కూడా సిద్ధం చేస్తోంది. నూతన టర్మినల్ నిర్మాణం, విమానాల నిలిపివేత, నియంత్రణ టవర్ వంటి నిర్మాణాలు.. ప్రయాణికుల కోసం ఆధునిక ఫెసిలిటీల కల్పన వంటి ఏర్పాట్లు చేయనున్నారు.ఈ పనులన్నీ త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఆదిలాబాద్ ప్రాంతం అనేక విధాలుగా ప్రయోజనాలు పొందనుంది. అలాగే ఇక్కడి స్థానిక ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగుపడనున్నాయి. భూముల ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతం.. హైదరాబాద్ వంటి ప్రాంతాలతో పోటీ పడనుంది.

కంచ గచ్చిబౌలి భూములపై నిజ నిర్ధారణ నివేదిక పంపండి

- రాష్ట్ర అటవీశాఖ అధికారులను కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశం

వివరాలు 2వ పేజీలో

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. ఎల్ఆర్ఎస్ ఫీజును 25% రాయితీతో చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. తాజాగా ఆ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ ఆశించిన మేర రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి ప్రభుత్వం అనుకున్నంతమేర స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పొడిగింపు ఈ నిర్ణయం తీసుకుంది.

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై 'సుప్రీం' ఆగ్రహం.

బలగం టీవి, హైదరాబాద్ బ్యూం

తెలంగాణ అసెంబ్లీలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎవరు పార్టీ మారినా ఉప ఎన్నికలు రావు అని వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది సుందరం సీఎం ప్రకటనను బెంచ్‌కు చదివి వినిపించారు. 'గౌరవనీయులైన స్పీకర్ సర్ తమరి ద్వారా నేను ఒకటి చెప్పదలుచుకున్న. ఎవరైతే సభ్యులున్నరో వాళ్లు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఏ ఉపఎన్నికలూ రావు. వారు కోరుకున్నా ఉపఎన్నికలు రావు. అటోళ్లు ఇటొచ్చినా, ఇటోళ్లు అటుపోయినా ఉపఎన్నికలు రావు' అంటూ వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై జస్టిస్ గవాయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సభలో ఇలా చెప్పి.. సీఎం పదో షెడ్యూల్‌ను అపహాస్యం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. తాను సీఎం తరపున హాజరుకాకపోవడంతో ఆ ప్రకటన గురించి వివరించలేకపోతున్నారని తెలిపారు. గతంలోనూ మరో కేసులో సీఎంని మందలించిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది.

చట్టసభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం.. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ని సీఎం స్థాయి హోదాలో ఉన్న అపహాస్యం చేయడం కిందకే వస్తుం దని కోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి వ్యాఖ్యలు మళ్లీ పునరావృతం కాకుండా సీఎంను హెచ్చరించాలని న్యాయవాది ముకుల్ రోహత్గికి సూచించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ తరహా వ్యాఖ్యలు ఉపేక్షించబోమని, అవసరమైతే కోర్టు ధిక్కారంగా భావించాల్సి వస్తుందని హెచ్చరించింది. తాము అన్ని ఆలోచించే కోర్టు ధిక్కార నోటీసులు ఇస్తున్నామని, అంతమాత్రాన తమకు అధికారాలు లేవని కాదని.. అసెంబ్లీలో రాజకీయ నేతలు చేసే ప్రకటనలకు పవిత్రత ఉంటుందని.. అసెంబ్లీలో మాట్లాడే అంశాలను సైతం కోర్టులో పరిగణలోకి తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది.

అసెంబ్లీ సెక్రటరీ తరపున ముకుల్ రోహత్గీ తన వాదనలు బెంచ్‌కు వినిపి స్తూ స్పీకర్ నిర్ణయంలో హైకోర్టు జోక్యంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేయగా.. జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులపై ఇక న్యాయస్థానాలు చేతులు కట్టుకుని కూర్చోవాలా అని కామెంట్ చేశారు. ఇదివరకు కోర్టు ధిక్కరణ కేసులో అసెంబ్లీ స్పీకర్‌ను కూడా కోర్టులో నిలబెట్టామనే విషయాన్ని మర్చిపోవొద్దని అన్నారు.

కేంద్రమంత్రికి బీఆర్ఎస్ ఎంపీలు వినతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయు)భూములను వేలం వేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను వెంటనే నిలువరించాల్సిందిగా బీఆర్ఎస్ ఎంపీలు కే.ఆర్.సురేష్ రెడ్డి,వద్దిరాజు రవిచంద్ర,దీవకొండ దామోదర్ రావులు కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ రవిచంద్ర,విప్ దామోదర్ రావులు బుధవారం ఢిల్లీలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో భేటీ అయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో నెలకొన్న సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములలో 400 ఎకరాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఎంపీలు మంత్రికి వివరించారు. ఈ భూములలో చెరువులు,కుంటలతో పాటు అరుదైన వృక్ష జాతులు,జింకలు, నెమళ్లు, సరీసృపాలతో జీవ వైవిధ్యం నెలకొని ఉందని,పరిసర ప్రాంతాల వారికి స్వచ్ఛమైన సహజవాయువు దొరుకుతున్నదన్నారు. ఎంతో విలువైన, తమ యూనివర్సిటీ భవిష్యత్తు అవసరాలకు గాను ఉన్న ఈ భూములను వేలం వేయకుండా నిలువరించాలని కోరుతూ విద్యార్థులు, మేధావులు ఆందోళన బాట పట్టిన విషయాన్ని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావులు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తెచ్చారు. మంత్రి వెంటనే స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎంపీలకు హామీనిచ్చారు.ఈ సందర్భంగా ఎంపీల వెంట రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్,బీఆర్ఎస్వీ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్,తుంగబాలు, సెంట్రల్, ఉస్మానియా యూనివర్సిటీలకు చెందిన పలువురు విద్యార్థి నాయకులు ఉన్నారు.

ప్రజలకు మనోధైర్యం వచ్చేలా మహాసభ ఉండాలి

- నియోజకవర్గాల వారిగా సన్నాహక సమావేశాలు నిర్వహించండి
- మాజీ సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల పై కేసీఆర్ సన్నాహక సమావేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల నేపథ్యంలో...ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలతో అధినేత కే.చంద్రశేఖర్ రావు బుధవారం ఎర్రవెల్లి నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు సూచించారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలిం చేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధిం చిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని నేతలకు సూచించారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కె. ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, గణేష్ బిగాల గుప్త, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే,పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో భారీ భూకంపం..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. బుధవారం రాత్రి 7.30గంటల సమయంలో క్యుషు కోస్టల్ ప్రాంతంలో భూ ప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.2గా నమోదైంది. ఈ భూకంపం కారణంగా ప్రాణ నష్టం జరగనట్లు తెలుస్తోంది. జపాన్ కు భూకంప హెచ్చరికలు గత రెండు మూడు రోజులుగా వస్తున్నాయి. అక్కడి ప్రభుత్వం కూడా దీనిపై రిపోర్ట్ ఇచ్చింది. 3 లక్షల మందికి భూకంపం ముప్పు ఉందన్న వార్నింగ్స్ సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి. అనుకున్నట్లే జపాన్ లో భూకంపం రావడంతో భయాందోళనలు పెరిగిపోయాయి. జపాన్ చుట్టు పక్కల దేశాలు సైతం భయపడుతున్నాయి. ఇప్పటికే వరుస భూప్రకంపనలతో మయన్మార్ వణికిపోయింది. మార్చి 26వ తేదీన మయన్మార్, థాయిలాండ్‌లో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. మయన్మార్ దేశంలో భారీ భూకంపం పెను విధ్వంసమే సృష్టించింది. గత శుక్రవారం మయన్మార్ లో సంభవించిన భూప్రకంపనల కారణంగా దాదాపు మూడు వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మరో 5 వేల మంది గాయపడ్డారు.వందల మంది ప్రజలు నిరాశ్రులయ్యారు.పెద్ద ఎత్తున ఇండ్లు కుప్పకూలిపోయాయి.

తల్లి కూతుళ్లపై ప్రేమోన్మాది దాడి

బలగం టీవి, హైదరాబాద్

విశాఖపట్నంలో దారుణం చోటుచేసుకుంది. మధురవాడ స్వయంకృషి నగర్‌లో ప్రేమోన్మాది ఘాతుకానికి పాల్పడ్డాడు. తల్లి, కుమార్తెపై కత్తితో దాడి చేశాడు. తల్లి లక్ష్మీస్పాట్‌లోనే చనిపోగా, కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ యువకుడు చాలా కాలంగా ప్రేమ పేరుతో ఆమె వెంట తిరుగుతున్నాడు. పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతోనే ఈ దారుణానికి ఒడిగట్టా డని తెలుస్తోంది. గంటల వ్యవధిలోనే విశాఖ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. అతన్ని రహస్యంగా విచారిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నవీన్ అనే వ్యక్తిగా గుర్తించారు. బాధితురాలిది కూడా శ్రీకాకుళం జిల్లాయే. విశాఖపట్నంలో డిగ్రీ చదువుతోంది. కొంతకాలంగా ఓ యువకుడు ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అతని ప్రేమను తిరస్కరించింది. దీంతో కక్ష పెంచుకున్న యువకుడు బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆమె ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో యువతి తల్లి నక్కా లక్ష్మి (43) ఘటనా స్థలంలోనే మృతి చెందింది. యువతి తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువతికి మెరుగైన వైద్యం అందివ్వాలని సూచించారు. నిందితుడికి కఠిన శిక్ష విధించే దిశగా విచారణ పూర్తి చేయాలని సూచించారు. మధురవాడ ప్రేమోన్మాది ఘటనపై హోంమంత్రి అనిత స్పందించారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలు ఆరోగ్య పరిస్థితిపై హోంమంత్రి ఆరా తీశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ముగ్గురు పిల్లలను హత్య చేసింది తల్లే...

బలగం టీవి, హైదరాబాద్

అమీన్‌పూర్ చిన్నారుల హత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. పిల్లలను తల్లే హత్య చేసిందని పోలీసులు తేల్చారు. వివాహేతర సంబంధం కారణంగా వారి అడ్డుతొలగించుకోవాలనుకున్న తల్లి రజిత పిల్లలను గొంతునులిమి చంపినట్లు విచారణలో ఒప్పుకుంది. దీంతో రజిత, ఆమె ప్రియుడు శివకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపిన వివరాల మేరకు రజిత అలియాస్ లావణ్యను ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న సమయంలో తన కన్నా వయసులో 20 సంవత్సరాలు పెద్దవాడైన అవురిచింతల చెన్నయ్యతో పెళ్లి జరిగింది. వీరికి సాయి కృష్ణ(12), మధుప్రియ(10), గౌతమ్(8) పిల్లలున్నారు. మూడు సంవత్సరాలుగా వీరంతా అమీన్‌పూర్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా, రజిత ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆరు నెలల క్రితం రజిత పదో తరగతి క్లాస్‌మేట్స్ అంతా కలిసి గెట్ టుగెదర్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో క్లాస్‌మేట్ శివతో పరిచయం కాస్త పెరిగి అది కాస్త శారీరకంగా కలిసే వరకు వెళ్లింది. రజిత, చెన్నయ్య మధ్య 20 ఏళ్ల వ్యత్యాసం ఉండటంతో భర్తతో కలిసి ఉండటం ఇష్టముండేది కాదు. దీంతో అతనితో తరచూ గొడవ పడుతుండేది. శివకుమార్ కలిసినప్పటి నుంచి తన జీవితం ఆనందంగా ఉందని, అతనికి పెళ్లి కాకపోయేసరికి ఎలాగైన పెళ్లి చేసుకోవాలని అనుకుంది. ఈ విషయమై రజిత, శివను అడగ్గా 'నీకు పెళ్లి కాకపోయి ఉంటే, పిల్లలు లేకుండా ఉంటే పెళ్లి చేసుకుంటానని' చెప్పడంతో ఎలాగైన భర్త, పిల్లల అడ్డు తొలగించుకోవాలనుకుంది. ఈ క్రమంలో మార్చి 27న సాయంత్రం 6 గంటలకు పిల్లలను చంపేస్తానని శివకు చెప్పింది. అదే రోజు రాత్రి తన భర్త భోజనం చేసి రాత్రి 10 గంటలకు ట్యాంకర్ తీసుకొని చందానగర్ వెళ్లిన సమయంలో ముగ్గురు పిల్లను టవల్‌తో గొంతు నులిమి చంపింది. ఆ కేసులో ఏ-1 రజిత, ఏ-2గా శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

హెచ్‌సియూ భూములు కాపాడిందే బీఆర్ఎస్

- **ఎమ్మెల్సీ కవిత**

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియూ) భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా 400 ఎకరాల భూములను కాపాడింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. యూనివర్సిటీ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోవద్దనే ఉద్దేశంతో బిఆర్ఎస్ ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందని, ఆ భూముల పరిరక్షణకు కెసిఆర్ ఆదేశాల మేరకు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదనలు వినిపించారని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో ఉన్నారని, సిఎం రేవంత్ రెడ్డి దుశ్చర్య వల్ల హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ పడిపోవడం వల్లే 400 ఎకరాల భూమిని విక్రయించాలని నిర్ణయించారని ఆరోపించారు. యూనివర్సిటీ నుంచి తీసుకున్న భూమిని యూనివర్సిటీకే ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. 397 ఎకరాలను ఇతర చోట యూనివర్సిటీకి ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం వితండవాదం చేస్తుందన్నారు. పరిశ్రమల ఏర్పాటు, భూముల విక్రయం ఆ 397 ఎకరాల్లో చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం పర్యావరణం, ప్రకృతి కోణంలో కూడా ఆలోచించాలని కోరారు. ఇప్పటికే కాంక్రీట్ జంగిల్ లాగా మారిన గచ్చిబౌలి ప్రాంతంలో ఈ 400 ఎకరాల్లో కూడా పెద్ద ఎత్తున కంపెనీలు ఏర్పాటు అయితే వాతావరణం పై ఎంత వత్తిడి పెరుగుతుందో ప్రభుత్వం గుర్తించాలన్నారు. బిఆర్ఎస్ హయాంలో మై హోమ్ విహంగ నిర్మాణానికి భూములు కేటాయించామనడంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆమె స్పష్టం చేశారు. మై హోమ్ విహంగా ప్రభుత్వ భూముల్లో నిర్మించినట్లయితే సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్లను పంపించాలని డిమాండ్ చేశారు. మై హోమ్ రామేశ్వరరావు బిజెపికి అనుగుడు కాబట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధైర్యం చేయడంలేదని విమర్శించారు. పేదలు, మూగజీవులు ఉంటే బుల్డోజర్లను ప్రయోగిస్తారు కానీ, పెద్దవాళ్లనేమో ముట్టుకోరా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.

ఎమ్మెల్సీగా నాగబాబు ప్రమాణ స్వీకారం

బలగం టీవి, హైదరాబాద్

ఇటీవల ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. బుధవారం నాగబాబు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు... నాగబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. మండలి చైర్మన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, జనసేన నేతలు హాజరయ్యారు. అనంతరం నాగబాబు సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు శాలువా కప్పి సన్మానించారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఏమైంది..?

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

బలగం టీవి, హైదరాబాద్

కామారెడ్డి బీసీ డిక్లరేషన్లో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతామని చెప్పి తర్వాత మరచిపోయారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రజల నుంచి ముఖ్యంగా బీసీల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో మరో గత్యంతరం లేక 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసనసభలో ఆమోదించారు తప్పితే, బీసీల బాగు కోరి కాదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానిం చారు. బీసీ సంక్షేమం కోసం ఏడాదికి రూ.20,000 కోట్లు చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బడ్జెట్‌లలోనూ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సమగ్ర సర్వేలో బీసీల జనాభా 46 శాతం అని చెబుతున్నప్పుడు మీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా అని ప్రశ్నించారు.సగానికి పైగా ఉన్న బీసీలకు మీరిచ్చిన మంత్రి పదవులు రెండంటే రెండేనని, దీనిని బట్టే తెలుస్తుంది బీసీల మీద మీకు ఎంత ప్రేమ ఉందోనని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. బీసీ జాతీయ కమిషన్‌కు రాజ్యాంగబద్ధతను కల్పించింది మోదీ ప్రభుత్వమేనని తెలిపారు. మోదీ విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లించే రాజకీయ కుట్రలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు.

కంచ గచ్చిబౌలి భూములపై నిజ నిర్ధారణ నివేదిక పంపండి

- **రాష్ట్ర అటవీశాఖ అధికారులను**

కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్

కంచ గచ్చిబౌలి భూములపై వెంటనే నిజ నిర్ధారణ నివేదిక పంపాలని రాష్ట్ర అటవీశాఖ అధికారులను కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశించింది. ఇప్పటికే ఉన్న కోర్టు తీర్పులను పరిగణంలోకి తీసుకోని ముందుకు వెళ్లాలని సూచించింది. అటవీ చట్టానికి లోబడి వెంటనే చర్యలు తీసుకోవాలని.. వాస్తవధార నివేదికతో పాటు సంబంధిత శాఖ తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జీ నగేశ్, రఘునందన్ రావు ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ని కలిసిన విషయం తెలిసిందే. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలు పర్యావరణ, హెరిటేజ్ భూములని తెలిపారు. హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ సమతుల్యతకు ఈ భూములు ఎంతో ప్రయోజనకరం కాబట్టి అనేక రకాల ఔషధ మొక్కలు, వివిధ పక్షి జాతులతో ఆ ప్రాంతమంతా అలరారుతున్నదని చెప్పారు. ఇంతటి విలువైన భూములను రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్‌గా మార్చి రూ.వేలకోట్లు దండుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. హెచ్‌సీయూ విద్యార్థులతో పాటు హైదరాబాద్ ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌కు తెలిపారు. వెంటనే కంచ గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకుని, ఆ భూములను పరిరక్షించాలని కోరిన విషయం తెలిసిందే.

పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తి అంటారు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు.అలాగే కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఏ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు.ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వా ర్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఇక ఈ వక్ఫ్ బోర్డు విషయంతో తాము క్లియర్‌గా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఆ క్రమంలో కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లలో ఇద్దరు ముస్లిమేతర వ్యక్తులు ఉండాలని నిర్ణయించామన్నారు. అలాగే ఈ వక్ఫ్ బోర్డులల్లో ముస్లిం మహిళలకు చోటు ఉండడం లేదని తెలిపారు. దీంతో ఈ బోర్డుల్లో ఇద్దరు ముస్లిం మహిళలకు స్థానం కల్పిస్తామన్నారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాదిలో జరగనున్నాయని.. ఆ రాష్ట్రంలో 17 శాతం మైనార్టీల ఓట్లు ఉన్నాయి. అందుకోసమే ఈ బిల్లును తీసుకు వస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి.

వక్ఫ్ బిల్లు ముస్లింలకు మేలు చేసేదే తప్ప.. కీడు చేసేది కాదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్ సభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లు అంశంపై రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు కావాలనే గందరగోళం సృష్టిస్తున్నాయని ఫైర్ అయ్యారు. వక్ఫ్ బిల్లుకు మెజార్టీ వర్గాల మద్దతు ఉంది. కానీ కొన్ని పార్టీలు మెనార్టీలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బిల్లు అతిపెద్ద సంస్కరణగా అభివర్ణించారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగబద్ధమేనని.. కావాలనే వక్ఫ్ బిల్లుపై మెనార్టీల్లో అపోహలు సృష్టిస్తున్నారని నిప్పులు చెరిగారు. అనేక రాష్ట్రాల్లో వక్ఫ్ భూములపై కేసులు ఉన్నాయని.. తెలంగాణ, హరియాణా, యూపీ వంటి రాష్ట్రాల్లో కేసులు నడుస్తున్నాయని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను ప్రార్థన, ధార్మిక కార్యక్రమాలకు వినియోగిస్తే ఎలాంటి ఇబ్బంది లేదని.. ఆ భూములను అక్రమాలకు ఉపయోగిస్తేనే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వక్ఫ్ ఆస్తులను అడ్డుపెట్టుకుని కొందరు వందల కోట్లు సంపాదిస్తున్నారని.. వక్ఫ్ ఉన్నది పేద ముస్లింల కోసం.. దొంగల కోసం కాదన్నారు. వక్ఫ్‌లో ముస్లిమేతరులకు చోటు లేదని స్పష్టం చేశార. అలాగే.. వక్ఫ్ ఆస్తుల సక్రమ వినియోగానికి ఈ బిల్లు తోడ్పడుతోంది.. వక్ఫ్‌లో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. వక్ఫ్ ఆస్తులను దోపిడీ చేస్తున్న వారిని పట్టుకోవడమే వక్ఫ్ కౌన్సిల్, బోర్డుల లక్ష్యమని పేర్కొన్నారు.2013లో కాంగ్రెస్ వక్ఫ్ బోర్డుకు అపరిమిత అధికారాలు కట్టబెట్టారని విమర్శించారు.

14000 ఎకరాలుండగా.. సిటీని ఎందుకు నాశనం చేస్తున్నారు..?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

కంచె గచ్చిబౌలి భూములపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఐటీ పార్కులు, ఇతర ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వానికి "ఫ్యూచర్ సిటీ"లో 14,000 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నప్పుడు.. భవిష్యత్ తరాలకు ఎంతో విలువైన పర్యావరణాన్ని లక్ష్యంగా చేసుకుని, ప్రస్తుత నగరాన్ని ఎందుకు నాశనం చేస్తున్నారని కేటీఆర్ నిలదీశారు.

నాగర్ కర్నూల్ ఘటన.. ఏడుగురు అరెస్టు

బలగం టీవి, హైదరాబాద్

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట మండలం అభయాంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఓ మహిళపై లైంగికదాడి జరిగిన ఘటన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి ఏడు గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆ నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అభయాంజనేయస్వామి దేవాలయానికి ఒక మహిళ తన కుటుంబ సభ్యులతో దర్శనం చేసుకున్నారు. అనంతరం అక్కడే నిద్ర చేయ డానికి పూనుకున్నారు. రాత్రి 11 గంటల సమ యంలో దేవాలయం వెనుక భాగంలో ఉన్న నిర్మా ణుష్య ప్రాంతంలో కాలకృ త్యాలు తీర్చుకో వడానికి తన సమీప బంధువుతో కలిసి వెళ్లారు. వీరిని అక్కడే ఉన్న నలుగురు నిందితులు గుర్తిం చి మరో ముగ్గురు నిందితులను ఫోన్ చేసి పిలిపించి మహిళతో పాటు వచ్చిన వ్యక్తిపై దాడి చేశారు. ఇలా ఏడుగురు మహిళపై లైంగికదాడికి పాల్పడ్డారు.

నేరాల నియంత్రణకు పగడ్బందీగా వ్యవహరించాలి

- డయల్100 కాల్స్ పట్ల తక్షణమే స్పందిస్తూ సమస్యలు పరిష్కరించాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం మినీ కాన్ఫరెన్స్ హాల్లో సిరిసిల్ల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సమీక్ష నిర్వహించారు. మొదటగా పోలీస్ స్టేషన్ల వారిగా నమోద్యైన గ్రేవ్ కేసులు,మహిళలపై నేరాలు,ఆస్తి నేరాలు, పోక్సో కేసులు,మిస్సింగ్ కేసులు, గంజాయి,రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించిన సమాచారంతో పాటు,పెండింగ్ కేసులు వాటి పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలు,నేరాల నియంత్రణకు కోసం పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు..

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని ,పెండింగ్ కేసులలో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలని సూచించారు.పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల దర్యాప్తుల్లో మరింత నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పెండింగ్ ఉన్న కేసులలో త్వరగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి నింధితులను అరెస్టు చేసి త్వరగా చార్జిషీట్ దఖాలు చేయాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో అన్ని స్థాయిలకు చెందిన పోలీసు అధికారులు పగడ్బందీగా వ్యవహరించాలని,నేరాల చెదనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతి డయల్ 100 కాల్స్ పట్ల తక్షణమే స్పందిస్తూ త్వరగతిన సంఘటన స్థలాలకు చేరుకొని సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి, పేకాట, పిడిఎస్ రైస్, గుడుంబా,ఇతర చట్ట వ్యతిరేకమైన నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేయాలని, ఇతర చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,ట్రిపుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, సదన్ కుమార్, మధుకర్, ఎస్.ఐలు సిబ్బంది పాల్గొన్నారు

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి

-బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఘనంగా నివాళులు అర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, ఎల్ డీ ఎం మల్లికార్జున్ రావు బీసీ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాక

బలగం టీవీ, సిరిసిల్ల

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, ఐదుగురు సభ్యులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. చైర్మెన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలా దేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్ లు గురువారం వేములవాడకు సాయంత్రం 06.00 గంటలకు చేరుకుంటారు. 4వ తేదీన శుక్రవారం ఉదయం 06.00 గంటలకు శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం ఉదయం 11.00 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి చేరుకొని, జిల్లా ఉన్నతాధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

ఎల్లారెడ్డిపేటలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల గౌడ సంక్షేమ సంఘం సభ్యులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు గంట కార్తీక్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆయన విగ్రహానికి పూలమాలవేసి కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సభ్యులు మాట్లాడుతూ..... పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడు అని, ప్రభుత్వం పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ప్రధాన కార్యదర్శి పందిల్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు కోల నారాయణ గౌడ్, క్యాషియర్ పందిర్లా సుధాకర్ గౌడ్, డైరెక్టర్లు పుల్లయ్య గారి తిరుపతి గౌడ్, గంట ఎల్లయ్య గౌడ్, మాజీ సర్పంచ్ నరస గౌడ్, పంధిర్లా లింగ గౌడ్, పందిర్ల పర్శరాములు గౌడ్, చింతకింది కిషన్ గౌడ్, గంట రమేష్ గౌడ్, గంట స్వామి గౌడ్, పరికి శ్రీనివాస్ గౌడ్, గంట సతీష్ గౌడ్, గంట దేవ గౌడ్ గంట వెంకటేష్ గౌడ్ ఆకుల అంజా గౌడ్ పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారుల బృందం

బలగం టీవీ, వేములవాడ

కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖకు చెందిన అధికార బృందం తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ స్వచ్ఛభారత్ మిషన్‌ను పరిశీలించుట కొరకు జిల్లా కు విచ్చేసి, రాజన్న ఆలయం లో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీ చంద్రగిరి శరత్ కుమార్ వీరికి వేదోక్త ఆశీర్వచనం ఇచ్చారు. వీరి వెంట ఆలయ పర్యవేక్షకులు వరి నర్సయ్య , ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఇతర అధికారులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బలగం టీవీ, తంగళ్లపల్లి

తంగళ్ళపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు చింతచెట్టు పై నుండి కింద పడి మృతి చెందిన బంటు ఆనందం నిరుపేద కుటుంబానికి మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య 50 కిలోల బియ్యం వితరణ చేశారు.బస్వాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పూర్మాని కనక లక్ష్మి లక్ష్మారెడ్డి 2వేల500, శ్రీనివాస్ రెడ్డి 2వేల 500 చొప్పున నిరుపేద కుటుంబానికి రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో అంతక్రియలు చేసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం కింద 20,000 రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్నే బాలయ్య, మాజీ సర్పంచ్ గోడిసెల నీరజ,ఎల్లయ్య, తాటిపాముల శ్రీనివాస్, గొడిసెల తిరుపతి, దేవయ్య, సత్తు రామ్ రెడ్డి, చంద్రమౌళి, సురేష్, మల్లయ్య, బాబు, కనకయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపును కేంద్రం తక్షణమే ఆమోదించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీల పోరు గర్జన
- రాజన్న సిరిసిల్ల నుంచి భారీగా తరలి వెళ్ళిన బీసీ శ్రేణులు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 29 శాతం నుండి 42 శాతం రిజర్వేషన్స్ పెంచుతూ బీసీ బిల్లును ఆమోదించి దాన్ని కేంద్రంకు పంపిన సందర్భం గా ప్రధాన మంత్రి మోదీ పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టి ఆమోదించి రాజ్యాంగంలోని షెడ్యూల్ తొమ్మిది లో చేర్చాలని బుధవారం న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ పోరు గర్జన చేపట్టామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండా సురేఖ ,వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మరి ఇతర ఎమ్మెల్యేలు ఎంపీలు పాల్గొన్నారని పర్శ హన్మాండ్లు అన్నారు,ఫోర్ గర్జన పేరిట న్యూ ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాలో రాజన్న

సిరిసిల్ల జిల్లా నుండి భారీ ఎత్తున దాదాపు 400 మంది బీసీ శ్రేణులు పాల్గొనడం ఇక్కడ విశేషం అని పర్శ హన్మాండ్లు అన్నారు,బీసీ పోరు గర్జన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పర్శ హన్మాండ్లు కృతజ్ఞతలు తెలిపారు,ఢిల్లీ లో ఈ కార్యక్రమం లో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేశ్ యాదవ్,పట్టణ అధ్యక్షుడు తడుక కమలాకర్ నాయకులు బచ్చు ప్రసాద్,ఇల్లంతకుంట తిరుపతి,శ్రీకాంత్,సబ్బని వేణు,కుసుమ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు,

రాజన్న గోశాలకు 5 ట్రాక్టర్ల ఎండుగడ్డి విరాళం

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

రాజన్న ఆలయ గోశాలలోని కోడెలకు నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మైలారం వాస్తవ్యులు వంచ రవీందర్ రెడ్డి ట్రాక్టర్ ల ఎండుగడ్డిని బుధవారం ఆలయ అధికారులకు అప్పజెప్పి రశీదు లు తీసుకొన్నారు.

ఆర్సీబీ విజయాలకు బ్రేక్

- ఆర్సీబీ పై గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో విజయం
- అదరగొట్టిన సాయి సుదర్శన్, బట్లర్, రూథర్ ఫోర్డ్
- బౌలింగ్‌లో 3 వికెట్లు తీసిని సిరాజ్

బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు షాక్ తగిలింది. వరుస విజయాలకు బ్రేక్ పడింది. బుధవారం బెంగళూరులో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో ఆర్సీబీపై విజయం సాధించింది. ఈ సీజన్‌లో వరుసగా 2 మ్యాచ్‌లు గెలిచిన ఆర్‌సీబీ దూకుడుకు బ్రేక్ వేసింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆదిలోనే షాక్ తగిలింది. 42 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి.. పీకల్లోకి కష్టాల్లో పడింది. కానీ జితేశ్ శర్మ (21 బంతుల్లో 33 రన్స్), లియామ్ లివింగ్ స్టోన్ (40 బంతుల్లో 54 రన్స్), టిమ్ డేవిడ్ (18 బంతుల్లో 32 రన్స్) రాణించడంతో ఆర్సీబీ.. నిర్ణీత 20 ఓవర్లలో 169/8 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో సిరాజ్ మూడు వికెట్లు తీశాడు. సాయి కిషోర్ రెండు వికెట్లు పడగొట్టగా.. అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మలు ఒక్కో వికెట్ తీశారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్.. ఆచీతూచి బ్యాటింగ్ చేసింది. సాయి సుదర్శన్ 36 బంతుల్లో 49 రన్స్ చేసి శుభారంభాన్ని అందించాడు. దాన్ని కొనసాగిస్తూ జోస్ బట్లర్.. 39 బంతుల్లో 73 రన్స్ నాటౌట్.. మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. రూథర్‌ఫోర్డ్ 18 బంతుల్లో 30 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో గుజరాత్ టైటాన్స్.. 17.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ టోర్నీలో గుజరాత్‌కు ఇది రెండో విజయం.

లక్నో బౌలర్‌కు జరిమానా

బలగం టీవి, లక్నో

ఐపీఎల్‌లో లక్నోతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌లో అనుచితంగా ప్రవర్తించిన లక్నో సూపర్ గెయింట్స్ బౌలర్ దిగ్వేశ్ సింగ్ రాతీకి బీసీసీఐ జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించింది. ఓ డీమెరిట్ పాయింట్ కూడా జోడించారు. పంజాబ్ కింగ్స్ బ్యాటర్ ప్రియాన్ష్ ఆర్యను ఔట్ చేసిన తర్వాత దిగ్వేశ్ సింగ్ రాతీ అతని వద్దకు వెళ్లి లెటర్ రైటింగ్ సంకేతం చేశాడు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు రాతీకి జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది.

ఐపీఎల్‌లోని ఆర్టికల్ 2.5 కింద లెవల్ 1 రూల్‌ను ఉల్లంఘించినట్లు లక్నో బౌలర్ దిగ్వేశ్ అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ విధించిన ఫీజును అతను ఆమోదించాడు. మ్యాచ్ రిఫరీ తీసుకున్న నిర్ణయమే ఫైనల్ అని ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో తెలిపింది.

టీమ్‌ఇండియా ఇంటర్నేషనల్ హోమ్ సీజన్ షెడ్యూల్ విడుదల

బలగం టీవి, హైదరాబాద్

టీమ్‌ఇండియా(సీనియర్ పురుషులు) ఇంటర్నేషనల్ హోమ్ సీజన్ 2025 షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. వచ్చే సీజన్‌లో భారత జట్టు వెస్ట్‌ఇండీస్, సౌత్ ఆఫ్రికా జట్లతో టెస్టు, వన్డేలు, టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ అక్టోబర్ 2 అహ్మదాబాద్‌లో మొదలవుతుంది. రెండో టెస్టు అక్టోబర్ 10న కోల్‌కతాలో ఆడనుంది. వెస్టిండీస్ సిరీస్ తర్వాత, భారతదేశం మూడు ఫార్మాట్లలో దక్షిణాఫ్రికాతో పోటీకి ఆతిథ్యం ఇస్తుంది. గౌహతి తన తొలి టెస్ట్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సిరీస్ నవంబర్ 14న న్యూఢిల్లీలో ప్రారంభమవుతుంది, నవంబర్ 22 నుండి గౌహతి రెండవ టెస్ట్‌ను నిర్వహిస్తుంది. ఆ తర్వాత డిసెంబర్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు మూడు వన్డేల సిరీస్, ఐదు టీ20ల సిరీస్‌లో తలపడతాయి, చివరి మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరుగుతుంది.



యశస్వి జైస్వాల్ సంచలన నిర్ణయం..!

బలగం టీవి, హైదరాబాద్

టీమిండియా స్టార్ క్రికెటర్ యశస్వి జైస్వాల్ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశవాళీ క్రికెట్‌లో ఇకపై ముంబైకి ఆడకూడదని ఈ యువ ఓపెనర్ నిశ్చయించుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే ముంబై క్రికెట్ అసోసియేషన్ కు జైస్వాల్ ఈ- మెయిల్ పంపినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని సురియాకు చెందిన యశస్వి జైస్వాల్.. దేశవాళీ క్రికెట్‌లో చాలా ఏళ్లుగా ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తన అండర్-19 కెరీర్ నుంచి ముంబైకి ఆడుతున్న ఈ ఎడమచేతి వాటం బ్యాటర్.. విజయ్ హజారే (వన్డే) టోర్నీలో డబుల్ సెంచరీ బాదడం ద్వారా క్రికెట్ ప్రేమికుల దృష్టిని ఆకర్షించాడు. అయితే, వచ్చే సీజన్ నుంచి జైస్వాల్ గోవాకు ఆడేందుకు సిద్ధమయ్యాడని తెలిసింది. ఇదే విషయాన్ని ఎంసీకేకు మెయిల్ ద్వారా తెలిపినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొంది. అర్జున్ టెండుల్కర్, సిద్దేశ్ లాడ్ మాదిరి జైస్వాల్ కూడా ముంబై జట్టును వీడి.. గోవాకు ప్రాతినిధ్యం వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఈ విషయం గురించి ఎంసీఏ వర్గాలు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడుతూ.. "అతడు గోవాకు ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయమై నిరభ్యంతర పత్రం కోసం మెయిల్ పంపాడు. వ్యక్తిగత కారణాల వల్లే గోవాకు ప్రాతినిధ్యం వహించాలని భావిస్తున్నట్లు తెలిపాడు" అని తెలిపాయి. కాగా గోవా జట్టుకు జైస్వాల్ కెప్టెన్‌గా వ్యవహరించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక ఐపీఎల్-2025లో రాజస్తాన్ రాయల్స్ ఓపెనర్‌గా ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌లలో కలిపి జైస్వాల్ కేవలం 34 పరుగులే చేశాడు.

కంచ గచ్చిబౌలి భూములను పరిరక్షించాలి

- నటి సమంత

బలగం టీవి, హైదరాబాద్

హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల భూముల వివాదంపై టాలీవుడ్ నటి సమంత ఇన్‌స్టా వేదికగా స్పందించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల కథనంపై ప్రముఖ ఆంగ్ల దినపత్రిక తెలంగాణ టుడే లో వచ్చిన ఆర్టికల్‌ని పోస్ట్ చేసిన సమంత.. కంచ గచ్చిబౌలి భూములను పరిరక్షించాలంటూ నినాదం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆన్‌లైన్ వేదికగా Change.org (సామాజిక సమస్యలపై ప్రశ్నించే సంస్థ) పిటిషన్‌కి సైన్ చేయాలని కోరింది.

సంగీత్ శోభన్‌తో సినిమాను ప్రకటించిన నిహారిక కొణిదెల

బలగం టీవి, హైదరాబాద్

నిహారిక కొణిదెల కమిటీ కుర్రోళ్లు సినిమాతో నిర్మాతగా మారిన విషయం తెలిసిందే. తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌లో కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ కుర్రోళ్లు చిత్రం హిట్ సినిమాగా నిలిచింది. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమా వస్తోంది. ఈ మేరకు నిహారిక తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న యువ కథానాయకుడు సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఇది వరకే నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగమయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా... సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి దర్శకురాలిగా పని చేశారు. తాజాగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ రూపొందించనున్న ఈ సినిమాతో మానస శర్మ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రానికి మానస శర్మ కథను అందించగా మహేశ్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేశ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించనున్నారు.

ఓటీటీలోకి రానున్న 'టుక్ టుక్'

బలగం టీవి, హైదరాబాద్



ఇటీవల విడుదలైన 'టుక్ టుక్' సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్‌లోకి రాబోతోంది. ఈ మేరకు ఈ సినిమాను ఏప్రిల్ 10 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఇక ఈ సినిమాలో శాన్వీ మేఘన, హర్ష్ రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. సుప్రీత్ సి.కృష్ణ డైరెక్ట్ చేసిన ఈ సినిమాను చిత్రవాహిణి ప్రొడక్షన్స్, ఆర్‌వైజి సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేశాయి.

హాలీవుడ్ స్టార్ నటుడు కన్నుమూత..

బలగం టీవి, హైదరాబాద్

హాలీవుడ్ స్టార్ నటుడు వాల్ కిల్మర్ కన్నుమూశారు. టాప్ గన్, బ్యాట్ మ్యాన్ ఫరెవర్, వండర్ ల్యాండ్, అలెగ్జాండర్, కిస్ కిస్ బ్యాంగ్ బ్యాంగ్, డెజావు, స్ట్రీట్స్ ఆఫ్ బ్లడ్, ది స్నో మ్యాన్, టాప్ గన్ మెవరిక్.. లాంటి ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో కీలక పాత్రలు పోషించాడు వాల్ కిల్మర్. సినిమాలతో పాటు పలు సిరీస్ లు, టీవీ షోలలో కూడా నటించాడు. వాల్ కిల్మర్ బ్యాట్ మ్యాన్ ఫరెవర్ సినిమాతో బ్యాట్ మ్యాన్ గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. గత కొన్నాళ్లుగా వాల్ కిల్మర్ గొంతు క్యాన్సర్ తో పాటు పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో సినిమాలకు దూరమయ్యాడు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వాల్ కిల్మర్ చికిత్స తీసుకుంటూ ఏప్రిల్ 1న లాస్ ఏంజిల్స్ లోని తన ఇంట్లోనే మరణించినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. వాల్ కిల్మర్ చివరి సినిమా టామ్ క్రూజ్ నటించిన టాప్ గన్ మెవరిక్. 1986 లో వచ్చిన టాప్ గన్ సినిమాలో వాల్ కిల్మర్ ఐస్ మ్యాన్ పాత్ర పోషించాడు. 36 ఏళ్ళ తర్వాత 2022 లో ఈ సినిమాకు టాప్ గన్ మెవరిక్ అని సీక్వెల్ తీశారు. ఇందులో కూడా వాల్ కిల్మర్ పాత్ర కంటిన్యూ ఉంది. అయితే అప్పటికే అతను గొంతు క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. దీంతో ఆ సినిమాకి డబ్బింగ్ చెప్పలేకపోవడంతో సోనాటిక్ అనే ఏఐ కంపెనీతో టై అప్ అయి తన వాయిస్ ని రీ క్రియేట్ చేయించాడు వాల్ కిల్మర్. ఆ ఆతర్వాత మళ్ళీ సినిమాలు చేయలేదు. వాల్ కిల్మర్ మరణంతో పలువురు హాలీవుడ్ సెలబ్రిటీలు ఆయనకు నివాళులు తెలుపుతున్నారు.